


తెలుగు దినపత్రిక
# సూర్య
www.suryaa.com

మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

సోమవారం 3 నవంబరు 2025 పేజీలు 8


## శ్రీ కురుమూర్తి వాస గోవిందా గోవిందా అంటూ స్వామిని దర్శించుకున్న భక్తులు



**చిన్నచింతకుంట సూర్య న్యూస్ :** మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం దేవస్థానము బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి శ్రీ కురుమూర్తి స్వామి జాతర వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు కార్తీక మాసం అదివారం పురస్కరించుకొని ఉదయము అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసిన అనంతరం స్వామి వారి దర్శనం భక్తులకు కల్పించారు బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులు మెట్లపై కొబ్బరికాయలు కొట్టి గోవింద నామస్మరణము చేస్తూ స్వామి వారి చెంతకు చేరి తమ తమ ముక్కులను తీర్చుకున్నారు కొందరు భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించారు శ్రీ కురుమూర్తి స్వామి ప్రత్యేక లక్ష్మీదేవి ఆలయంలో పాదుకలు ఆంజనేయస్వామి చెన్న కేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం జాతర మైదానంలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో భక్తులు వివిధ వస్తువులను కొనుగోలు చేశారు ఆదివారం విద్యార్థులకు పాఠశాలలు ఉద్యోగస్తులకు ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు చిన్నారులు యువకులు మహిళలు రంగుల రత్నాలు బ్రేక్ డాన్సులు హంస వాహనాలు ఎక్కి ఎంజాయ్ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం చైర్మన్ జి గోవర్ధన్ రెడ్డి ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

## పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించాలంటూ సామాజిక కార్యకర్త నర్సింహా డిమాండ్



**ఊట్కూర్ సూర్య న్యూస్ :** ఈ సంవత్సరం నారాయణపేట జిల్లాలో కురిసిన అధిక వర్షాల కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా ఆదివారం తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారులతో మాట్లాడిన నర్సింహా, తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్టం ప్రకటించి నష్టపరిహారం అందించిన ప్రభుత్వం, అధిక వర్షాల వల్ల నష్టపోయిన పత్తి రైతులకు మాత్రం ఎందుకు నష్టపరిహారం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ అధికారులు మా చేతిలో ఏమి లేదు, ప్రభుత్వం చెప్పినదే చేస్తాం అని స్పందించినట్లు తెలిపారు. వర్షాల కారణంగా పత్తిలో తేమ శాతం 12 కంటే ఎక్కువగా ఉండడంతో, రైతులు మార్కెట్‌లో తమ పంటను విక్రయించలేక ఇబ్బందులు పడుతున్నారని నర్సింహా ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సీసీఐ అధికారులకు తేమ శాతం 20 వరకు ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేయాలని కోరారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంటలు భూమిపై వాలిపోవడంతో మొలకలు వస్తున్నాయని, వరి చేను మురిగిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి, వరి పంటల నష్టాన్ని వ్యవసాయ అధికారులు నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపించి, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని నర్సింహా విజ్ఞప్తి చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా ఉండేందుకు వాతావరణ ఆధారిత పంట బీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను నర్సింహా కోరారు. ఈ సమావేశంలో రైతులు బడేసాబ్, కుర్మప్ప, వాకిటి కిష్టప్ప పాల్గొన్నారు.

## మర్లపాడు తండాను సందర్శించిన బి ఆర్ ఎస్ పార్టీ సమన్వయకర్త మర్రి జనార్దన్ రెడ్డి.

- తాండవాసులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. - తాండవాసులకు బియ్యం నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన నేతలు.



**అచ్చంపేట సూర్య న్యూస్. :** అచ్చంపేట మండల పరిధిలోని నక్కలగండి రిజర్వాయర్ బ్యాక్ వాటర్లో మొత్తం మునిగిపోయిన మర్లపాడు తండా తండాను ఆదివారం అచ్చంపేట బి ఆర్ ఎస్ పార్టీ సమన్వయ కర్త మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి. సందర్శించారు.సర్వం కోల్పోయిన మర్లపాడు తాండ గిరిజనులకు మానవత్వంతో అండగా నిలిచారు.తనఎం జె ఆర్ ట్రస్ట్ ద్వారా 200 గిరిజన కుటుంబాలకు బియ్యం,నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన మానవత్వం చాటుకున్నారు. వరదలో సర్వం కోల్పోయిన తండా వాసులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు.వరదలో తండా మొత్తం మునిగిపోయిన కూడా నామ మాత్రంగా పర్యటించి ఎలాంటి సాయం చెయ్యని ప్రభుత్వంపై మండిపడ్డారు. అచ్చంపేట మండలంలోని మర్లపాడు తండా గ్రామ పంచాయతీ మొంథా తుఫాన్ సందర్భంగా కురిసిన భారీ వర్షంతో ఈ సందర్భంగా ముంపుకు గురైన తండా మొత్తన్ని కలియతిరిగి వరదలో కూరుకపోయిన ఇళ్లను పరిశీలించారు,రైతులు ఇళ్లలో పెట్టుకున్న పత్తిని ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తండా వాసులను నేరుగా కలిసి వారికి ధైర్యం చెప్పారు,వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు, ప్రజల కష్టసుఖాలు పంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. విపత్తు సమయంలో మనం అందరం కలిసి నిలబడి సహాయం చేయాలి అని అన్నారు,వరదలో మొత్తం తండా ముంపుకు గురైన ప్రభుత్వం పట్టించుకోలేదు అని మండిపడ్డారు,ప్రభుత్వం వెంటనే ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులుపోకలమనోహర్, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు కోట్ల రూపాయలతో మయూరి పార్కు అభివృద్ధి

**- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ**







**పాలమూరు సూర్య న్యూస్:** నగర్ వన్ యోజన ద్వారా 2 కోట్ల రూ.లతో మయూరి పార్క్ అభివృద్ధి , పునరుద్ధరణ , సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా.సి.సువర్ణ అన్నారు.ఆదివారం మయూరి పార్క్ లో బోటింగ్ ప్రదేశం వద్ద మొక్కను నాటిన అనంతరం సమావేశ మందిరం వద్ద నగర వన్ కింద సుమారు 70 లక్షల వ్యయంతో పూర్తి చేసిన రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్,15 కిలో వాట్,11 సైకిళ్లు, పిల్లల ఆటల పరికరాలు,టైగర్ ఫోటో పాయింట్ పున రుద్ధరణ ,మరమ్మత్తు పనులు,బటర్ ఫ్లై,కరెన్సీ పార్క్ పునరుద్ధరణ,సుందరీకరణ పనులను ఆమె ప్రారంభించారు. నగర వన్ ద్వారా పూర్తి చేసిన,జరుగుతున్న పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ఆమె తిలకించి పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం అటవీ సిబ్బంది ఆమె మాట్లాడారు. తర్వాత పిల్లల మర్రి వృక్షం ను సందర్శించారు.పిల్లల మర్రి ప్రాముఖ్యత గురించి అటవీ అధికారులు వివరించారు.అనంతరం డీర్ పార్క్,మినీ జూ పార్క్ ను ఆమె సందర్శించి అక్కడ వివిధ పక్షులు, జంతువుల గురించి ఆసక్తిగా తిలకించారు. చివరగా రాజ రాజేశ్వరి ఆలయం,మ్యూజియం ను సందర్శించారు. మ్యూజియం లో సేకరించిన పురాతన విగ్రహాలు,నాణేలు,వస్తువులు, సామాగ్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జోగులాంబ సర్కిల్ శివాల రాం బాబు,జిల్లా అటవీ అధికారి ఎస్.సత్యనారాయణ,ఎఫ్.ఆర్.ఓ.ఎం.డి.అబ్దుల్ హై ఉన్నారు.

## 12వ శతాబ్దినాటి పురాతన వినాయక విగ్రహాన్ని కాపాడుకోవాలి పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



**లింగాల, సూర్య న్యూస్:** మండల కేంద్రమైన లింగాల శివారులో గల పాత శివాలయం వద్ద సా.శ. 12వ శతాబ్దికి చెందిన వినాయక విగ్రహాన్ని ఒక్క చెట్టు కబలిస్తుందని, చారిత్రక ప్రాధాన్యత గల ఆ విగ్రహాన్ని వెలికి తీసి కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకులు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్స్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి కోరారు. ఆదివారం లింగాల శివారులోని పాత శివాలయం వద్దగల పురాతన వినాయక విగ్రహాన్ని పరిశీలించి విగ్రహం విశిష్టతను వివరించారు. లింగాలకు రెండు కిలోమీటర్ల దూరంలో పొలాల్లో ఉన్న శిధిల త్రికూటాలయం ముందు సా.శ.1167, ఏప్రిల్ 30 ఆదివారం నాటి కందూరు చోళ వంశానికి చెందిన రెండో గోకర్ణుని శాసన శకలం ఉందని తెలిపారు. గోకర్ణని కుమారుడైన తొండయ లింగాలలో విష్ణు, శివ, సూర్య లకు త్రికుటాలయం నిర్మించి, కృష్ణా తీరంలో సోమేశ్వరాలయానికి లింగాల గ్రామాన్ని దానం చేసిన వివరాలు ఉన్నాయని, ఆలయం లోపల 12వ శతాబ్ది నాటి వీరభద్ర, భైరవ, సూర్య విగ్రహాలు, ఆలయం ముందు దీప స్తంభం, చెట్టు తొర్రలో వినాయకుడు, పక్కనే భిన్నమైన భద్రకాళి విగ్రహాలు ఉన్నాయని శివనాగిరెడ్డి చెప్పారు. మరి కొంత కాలానికి వినాయక విగ్రహాన్ని చెట్టు పూర్తిగా తనలో కలిపేసుకుంటుందని, అందువల్ల విలువైన విగ్రహం కనుమరుగవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాచీన సంస్కృతి సంప్రయాలకు తార్కానంగా నిలిచే పురాతన కట్టడాలు, శిల్పాలను భవిష్యత్ తరాలకు వారసత్వ సంపదగా ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి పీఠం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం





**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** నారాయణపేట శక్తి అధిపతి శాంతానంద పురోహిత ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన భోజనం కార్యక్రమం నిర్వహించారు.ఒక రోజు ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా కృష్ణ భీమా నదీ సంగమలో సంకల్ప సహిత భక్తులను నది స్నానం ఆచరించారు. కార్యక్రమంలో భాగంగా యాత్రకు విచ్చేసిన భక్తులచే కృష్ణ భీమా నదీ సంగమ స్థలములో భక్తుల చేత సంకల్ప సహితముగా నదీ స్నానము నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించి సహా పంక్తి భోజనం చేశారు.అంతకు ముందు శ్రీనివాసా కల్యాణం నిర్వహించారు.

## కేటిదొడ్డి ఎస్ఐని సన్మానించిన మార్కెట్ యార్డు చైర్మన్



**కేటిదొడ్డి సూర్య న్యూస్ :** మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసులును ఆదివారం గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, మండల ఆధ్యక్షులు ఉరుకుంద, మండల నాయకులు యుగేందర్ గౌడ్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై పి. శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాలలో అందరు కలిసిమెలిసి ఉండాలని, శాంతిభద్రతలకు అందరు సహకరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, అనేలైన్ సైబర్ మోసగాళ్ల వలలో పడకూడదని ఎవ్వరైనా అనుమాస్పదంగా ఊర్లలోకి వస్తే మాకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎస్ఐని సన్మానించిన వారిలో నాయకులు కొండయ్య, జంగిలప్ప, డి.వీరేష్, హెచ్ వీరేష్, రాఘువేంద్ర, రంగస్వామి, తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక టిప్పర్ పట్టివేత కేసునమోదు



**మద్దూరు సూర్య న్యూస్ :** కోయిల్ కొండ మండలం సూరారం వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్ ఎపి 22 యూ సి 1793 లో మద్దూరు పోలీసులు గుండుమాల్ వైపు తరలిస్తుండగా లింగల్ చెడ్ దగ్గర మద్దూరు పోలీసులు పట్టుకొని డ్రైవర్ శివకుమార్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## నేడే విద్యుత్ వినియోగ దారుల దినోత్సవం

**నారాయణపేట టౌన్ సూర్య న్యూస్ :** నారాయణపేట సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటల కు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించనున్న ట్లు స్థానిక ఎస్.ఈ. వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణపేట పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ పరమైన సమస్యలు విద్యుత్ అధికారుల దృష్టికి వ్రాత పూర్వకంగా ఇవ్వగలరని కోరడమైనది. వ్యసాయ రంగానికి సంబంధించిన సమస్యలు, వ్యవసాయ పంపుసెట్లు నాణ్యమైన ఐ.ఎస్.ఐ. మార్క్ కలిగిన వస్తువులను కోనుగోలు చేయ్యాలని అధికారులు సూచించారు. కావున ఈ సమయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. సకాలంలో రైతులు, విద్యుత్ వినియోగదారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. నారాయణపేట తోపాటు మక్తల్, కోస్గి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్.ఈ. వెంకటరమణ పత్రికా ప్రకటన లో పేర్కొన్నారు.

### జూబ్లీహిల్స్ లో ఎమ్మెల్యే కసిరెడ్డి ముమ్మర ప్రచారం..



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా పలు బూతులలో గడపగడపకు తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన బిఆర్ఎస్, బిజెపి పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎద్దేవ చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలన చూసి ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు, జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వెయ్యాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## నేటి విద్య సంస్థల బంద్ విజయవంతం చేయండి. - బిపీడీఎస్‌యు




**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో 8,500 కోట్ల స్కాలర్శిప్,రీయింబర్స్‌మెంట్ బకాయలను వెంటనే విడుదల చేయాలని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ అన్నారు. ఈ నెల 3 నుండి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం చేపట్టిన విద్య సంస్థల బంద్ కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదనీ తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ భగత్ సింగ్ భవన్ లో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ కళాశాలలు స్కాలర్షిప్,రియంబర్స్మెంట్ పై ఆధారపడి నడుస్తున్నవే , అలాంటి కళాశాలలో వేలాది మంది విద్యార్థులు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ పై ఆధారపడి విద్యని అభ్యసిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో ఉన్నదన్నారు.ఇప్పటికీ విద్యార్థులకు రావాల్సిన 8,500 కోట్లు పెండింగ్లో ఉన్నవనీ నేటికి ప్రభుత్వం విడుదల చేయడం లేదనీ అన్నారు..అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే పెండింగ్ స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే క్లియర్ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు విప్పడం లేదంటే ప్రభుత్వ విద్యపై వారికి ఉన్న శ్రద్ధ అర్థమౌతుందన్నారు తక్షణమే ప్రభుత్వం దిగివచ్చి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ,ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి,కళాశాలల యాజమాన్యం కు,పేద మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ ,జిల్లా కోశాధికారి మహేష్ జిల్లా నాయకులు సురేష్ ,నాయకులు మైపాల్, మణికంఠ ,గురు రాజు తోపాటు తదితదారులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి

### - బీఎస్పీ నాయకుడు కొక్కు గౌతమ్



**ఊట్కూర్ సూర్య న్యూస్ :** తెలంగాణాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి ప్రభుత్వం తక్షణ సాయం అందించాలనే డిమాండ్ చేశారు బహుజన్ సమాజ్ పార్టీ ఊట్కూర్ మండల ఇంచార్జి కొక్కు గౌతమ్. ఆదివారం మండల కేంద్రంలో ఒక ప్రకటనలో తెలుపుతూ, క్వింటల్ పత్తిని కనీస మద్దతు ధర రూ.10 వేలకు ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి అని కోరారు. రైతులు కష్టపడి పండించే ప్రతి పంటకు ప్రభుత్వం సరైన మద్దతు ధర కల్పించాలి. ప్రస్తుతం పత్తి రైతులు వర్షాలతో పాటు మార్కెట్ లో ధరల పతనంతో రెండింతల నష్టాన్ని ఎదుర్కొంటున్నారు, అని గౌతమ్ తెలిపారు. అలాగే, ఇందిరమ్మ ప్రజాపాలనలో రైతుల గోసను పట్టించుకోని ప్రభుత్వం, ఇప్పటికైనా రైతుల సమస్యలను సీరియస్‌గా తీసుకోవాలి. పత్తి, వరి, మక్క వంటి పంటలకు తక్షణ మద్దతు ధరలు ప్రకటించాలి, అని డిమాండ్ చేశారు. రైతులు భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా వాతావరణ ఆధారిత పంట బీమా, సమయానుకూల సబ్సిడీలు కల్పించాలని కూడా గౌతమ్ ప్రభుత్వాన్ని కోరారు.

## 2023 జూలై నుండి పీఆర్సీ ని అమలు చేయాలి

### - పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ బాబు



**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** వేతన సవరణ నివేదికను వెంటనే తెప్పించుకొని 2023 జూలై నుండి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. జిల్లా కేంద్రంలోని సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన మహబూబ్ నగర్ గ్రామీణ మండల పీఆర్టీయూ తెలంగాణ మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో శ్యామ్ బాబు మాట్లాడుతూ ,పీఆర్సీతో పాటు పెండింగులో ఉన్న కరువుభత్యం మంజూరు, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆరోగ్య పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. మహబూబ్ నగర్ గ్రామీణ మండలం అధ్యక్షుడు గా పాల్, మండల ప్రధాన కార్యదర్శి గా మనోహర్, మండల మహిళా అధ్యక్షురాలు గా భ్రమరాంబ, సురేష్, సుశీల తుల్జారాం, నర్సోజీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. బాలానగర్ మండల అధ్యక్షుడు శివానంద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ రిజర్వేషన్ల ఉద్యమం




**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే తెలంగాణ తరహాలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టి పోరాటాలు చేసి సాధించుకోవాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ అన్నారు. చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భూత్పూర్ మండల కేంద్రంలో వివిధ కుల సంఘ ప్రతినిధులు, మేధావులు, బీసీ నాయకులు తో కలిసి పాల్గొని ప్రసంగించారు. బీసీ మేధావులు మాట్లాడుతూ తమిళనాడు తరహాలో బీసీ లకు రిజర్వేషన్లు చట్టబద్ధత కలిగి ఉన్నప్పుడే అమలు అవుతాయని, రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో పెడితే తప్ప తెలంగాణలో బీసీలు రిజర్వేషన్లు అనుభవించ టానికి అవకాశం ఉంటుందని అన్నారు. బీసీ భావజాల వ్యాప్తి జరిగితేనే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని ఆ దిశగా బీసీలందరూ ముందుకు వెళ్లి కుల సంఘాలను, ప్రజాసంఘాలను, విద్యార్థి సంఘాలను, మేధావి వర్గాలను కలుపుకొని రిజర్వేషన్లను మన హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిఇఓ విజయకుమార్, మేధావి వర్గం నాయకులు జుర్రు నారాయణ యాదవ్, రమేష్ గౌడ్, ప్రొఫెసర్ డాక్టర్ రామరాజు, టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ పట్టణ ఉపాదక్షుడు టి.కృష్ణ వివిధ కులసంఘ నాయకులు మల్లేష్ యాదవ్,గొడుగు రాజు ముదిరాజ్, శివ చారి,గుంటి గోపి, నరసింహ,రఘు, సాయిశంకర్, బాల్ రాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## చెన్నారం గ్రామస్తులు పలువురు బీజేపీలో చేరిక



**రేవల్లి (ఏదుల) సూర్య న్యూస్ :** హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సమక్షంలో ఏదుల మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన వెంకటపతి రాజు (బి ఆర్ ఎస్ పార్టీ) తమ గ్రామం నుండి సుమారు 80 మంది కార్యకర్తలతో కలిసి భారతీయ జనతా పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు.రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కొత్తగా పార్టీలో చేరిన వారికి స్వాగతం పలుకుతూ, వారి సహకారంతో బీజేపీ బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ,ప్రజా సేవకు, గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేసే పార్టీ బీజేపీ పార్టీ అని, గ్రామ స్థాయిలో ప్రజల నమ్మకం బీజేపీ వైపు తిరుగుతోందని అన్నారు.తెలంగాణలో అభివృద్ధి, పారదర్శక పాలన, యువతకు అవకాశాలు కల్పించగల పార్టీ బీజేపీయే. చెన్నారం గ్రామం నుండి ఈ చేరిక పార్టీకి మరింత బలాన్నిస్తుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భారత్ ప్రసాద్ వనపర్తి జిల్లా అధ్యక్షులు నారాయణ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోకనాథ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు పురుషోత్తం రెడ్డి, సబ్బిరెడ్డి,అయ్యవారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకుడు పెద్దిరాజు , శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అయిజలో కిశోర బాలికల స్నేహ సంఘాలకు ఆటలు, పాటల పోటీలు





**ఐజ సూర్య న్యూస్ :** అయిజ మండల సమాఖ్య ఆధ్వర్యంలో కిశోర బాలికలలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం, వారిలో స్నేహభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఆదివారం ఆటలు, పాటల పోటీల కార్యక్రమం ఉల్లాసభరితంగా జరిగింది. మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మండలంలోని పలు కిశోర బాలికల స్నేహ సంఘాలకు చెందిన బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలికలు ఆటలు, పాటల విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు.పోటీల అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలకు మండల సమాఖ్య అధ్యక్షుల చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేయడం జరిగింది. బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని అధ్యక్షులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో మండల సమాఖ్య సభ్యులు, సిబ్బంది కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ ఓబీలు (మండల సమాఖ్య ఆఫీస్ బేరర్లు), వి.ఓ ఓబీలు ((గ్రామ సంఘాల ఆఫీస్ బేరర్లు), సీసీలు (కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు) మరియు ఇతర ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల దినోత్సవం: సమస్యల పరిష్కారానికి సదస్సు

**ఐజ సూర్య న్యూస్ :** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సోమవారం అయిజలో ఒక ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేయబడుతున్నట్లు టీజీఎస్ పీడీసీఎల్ అధికారులు తెలిపారు.ఉదయం 10:00 గంటలకు, గద్వాల్ రోడ్డులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, అయిజ ఆవరణలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, టీజీఎస్ పీడీసీఎల్, అయిజ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడుతున్న ఈ వినియోగదారుల సదస్సులో అయిజ, గట్టు, మల్దకల్, రాజోలి మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు పాల్గొనవచ్చు. ఈ సదస్సులో వినియోగదారులు తమకు సంబంధించిన విద్యుత్ సమస్యలను (మీటర్లు, బిల్లులు, సరఫరా, కొత్త కనెక్షన్లు మొదలైనవి) నేరుగా అధికారులకు తెలియజేసి, అక్కడికక్కడే సత్వర పరిష్కారం పొందగలరని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండలాల విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మరియు ఇతర సిబ్బంది కూడా పాల్గొంటారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్నేహితుని కుటుంబానికి అండగా



**నవాబుపేట్ సూర్య న్యూస్:** ఇటీవల మండల పరిధిలోని యన్మన్ గండ్ల గ్రామానికి చెందిన చాకలి జగదీష్ అనే యువకుడు విద్యుత్ షాక్ తో మరణించడం జరిగింది.అతని తోటి స్నేహితులు పదవ తరగతి 2011-12విద్యా సంవత్సరానికి చెందిన వారు ఆదివారం అతని కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం అందించి స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో లక్ష్మణ్,ఉమా మహేష్, సంజయ్, మోతిలాల్, రవి, వెంకటేష్, సురేష్, రాజు, రాఘవేందర్, చందర్, నాగరాజు, నర్సిములు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహశీల్దార్ కు సన్మానం



**మాగనూర్ సూర్య న్యూస్ :** ఇటీవల గ్రూప్ 2 పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన పిబి.శివ కు డిప్యూటీ తహశీల్దార్ గా ఉద్యోగం సాధించిన సందర్భంగా ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టి పోటీ పరీక్షల్లో సత్తా చాటి డిప్యూటీ తహశీల్దార్ గా ఉద్యోగం సాధించిన సందర్భంగా కుటుంబ సభ్యులు,గ్రామస్తులు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆనంద్ గౌడ్,మాజీ సర్పంచ్ రాజు, యూత్ అధ్యక్షులు ఆనంద్, నాయకులు శ్రీనివాస్, నరేష్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలు వృథా కావు: సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ



ఐజ సూర్య న్యూస్ : జోగులాంబ గద్వాల జిల్లా, అయిజ మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు అమరుల చిత్రపటాలకు ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం జరిగిన వర్ధంతి సభను ఉద్దేశించి సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు జమ్మిచేడ్ కార్తీక్ ముఖ్య వక్తగా ప్రసంగించారు. భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం పోరాడి అమరులైన వారి త్యాగాలు వృథా కావని, వారు అజేయులు అని ఆయన అన్నారు. దోపిడీ పాలకవర్గాలు పేద ప్రజల కోసం పోరాడుతున్న నాయకులను బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమార్చినంత మాత్రాన విప్లవం అంతం కాదని, దేశంలో దోపిడీ ఉన్నంతవరకు ప్రజా పోరాటాలు వర్ధిల్లుతాయని ఆయన స్పష్టం చేశారు.ప్రజా పోరాటాలను పాలకులు అణచివేయాలని కుట్ర చేసినప్పుడు, ప్రజలు సాయుధ తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకోక తప్పదని కార్తీక్ హెచ్చరించారు. వేలాది మంది వీరులను ప్రభుత్వాలు బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేసినప్పటికీ, విప్లవోద్యమం పురోగమించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.నేటి పరిస్థితుల్లో బీజేపీ మతతత్వ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను ప్రశ్నించే గొంతుకను, పోరాడే ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేస్తుందని ఆయన విమర్శించారు. కావున, పేద ప్రజలు ఒకే ఎజెండా మీదికి, విప్లవకారులు అమరవీరుల ఆశయ సాధన కోసం ఒకే వేదిక మీదికి రావలసిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. పేద ప్రజల రాజ్యమే లక్ష్యంగా విప్లవకారులు ఐక్యం కావలసిన ఆవశ్యకత ఉందని ఆయన నొక్కి చెప్పారు.ఈ సందర్భంగా ఆయన అమరులైన పలువురు నాయకుల త్యాగాలను స్మరించుకున్నారు. టేకులపల్లి మండలానికి చెందిన నంబూరు సీతారామారావు, సుశేనా, చింత లక్ష్మి, పరశురాములు, కోటనలను ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేసిందని ఆరోపించారు. అదే విధంగా అనారోగ్యంతో అమరులైన కాంపాటి చంద్రం, జోగా పోతయ్య, రాయల వాసు, తోటకూరి వెంకటేశ్వర్లు లకు, గోదావరి లోయలో ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన దొరన్న, ఎల్లన్న, బాటన్న, లింగన్న, పగడాల వెంకన్న, ముస్మి వంటి నాయకులకు నివాళులర్పించారు.అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ముందుకు సాగినప్పుడే వారికి నిజమైన నివాళి అని ఆయన సభకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటేష్, ఆనోకు, రాజు, జాషువా, విజయ్, ఏబీఎన్ విశ్వనాథ్, రాకేష్, శేఖర్ తదితరులు పాల్గొని అమరులకు నివాళు లర్పించారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలి ఎంఈఓ రవీంద్రబాబు



**ధరూర్ సూర్య న్యూస్ :** మండల కేంద్రంలోని బీసీ బాయ్స్ హాస్టల్ మరియు కేజీబీవీ ధరూర్ పాఠశాలను మధ్యాహ్న భోజన సమయంలో సందర్శించడం జరిగింది. విద్యార్థులకు మధ్యాహ్న సమయంలో పెట్టే లంచ్ ను పరిశీలించి భోజనాన్ని శుభ్రంగా నాణ్యంగా పెట్టాలని అక్కడ ఉన్న ఉపాధ్యాయులకు తెలియజేయడం జరిగింది.కలెక్టర్ బి ఎం సంతోష్ కుమార్ ఆదేశానుసారం తనిఖీ చేసిన మండల విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి. మధ్యాహ్న భోజనానికి సంబంధించినటువంటి పలు రికార్డులను పరిశీలించి నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని హాస్టల్ వార్డెన్ నర్సింలుకు తెలియజేశారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించడంతోపాటు బియ్యం నాణ్యత వంట విధానం కిచెన్ శుభ్రత తాగునీటి సదుపాయంలో సక్రమంగా నిర్వహించాలన్నారు వంట పాత్రలు శుభ్రంగా కడిగి వంటలు చేయాలన్నారు భోజనములో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలే అని అన్నారు.భోజనాన్ని రుచికరంగా శుభ్రంగా, నాణ్యత తో వండాలని వంట వారికి ఆదేశించడం జరిగింది. ఆహార నాణ్యత పై సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

## రబీ వరి బోనస్ చెల్లించకపోతే కలెక్టరేట్ ముట్టడి: బీఆర్ఎస్వీ



**ఐజ సూర్య న్యూస్ :** రైతులకు రబీ సీజన్ వరి పంటకు సంబంధించిన బోనస్‌ను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. బోనస్ చెల్లించని పక్షంలో త్వరలోనే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన ప్రకటించారు.అలంపూర్ నియోజకవర్గం, అయిజ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కురువ పల్లయ్య మాట్లాడుతూ రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్‌ను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 88,697.960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగగా, దీనికి గాను రైతులకు ? 44 కోట్ల 35 లక్షల (? 44,34,89,800) బోనస్‌ను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, కానీ ఇప్పటివరకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు.రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేని చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్‌దని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటివరకు రెండు లక్షల రుణమాఫీ హామీని నెరవేర్చలేదు. రైతు భరోసా కింద నాలుగు ఎకరాల రైతుకు సుమారు ? 76,000 బాకీ ఉన్నదని తెలిపారు. రైతు డిక్లరేషన్ పేరుతో రైతులను ప్రభుత్వం మాయావంచన చేసిందని ఆరోపించారు.బోనస్‌ను తక్షణమే చెల్లించని పక్షంలో త్వరలోనే జిల్లా రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని పల్లయ్య హెచ్చరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైబు, వెంకటేష్, నరసింహులు, లింగన్న, రాజు తదితర బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

## బింగిదొడ్డి యువకులకు కబడ్డీ జెర్సీల పంపిణీ



**ఐజ సూర్య న్యూస్ :** కార్తీక పౌర్ణమి పండుగ సందర్భంగా యువతలో క్రీడా స్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించే ఉద్దేశంతో జోగులాంబ గద్వాల జిల్లా, అయిజ మండలం బింగిదొడ్డి గ్రామంలో గ్రామ యువకులకు కబడ్డీ టీ-షర్ట్‌లను (జెర్సీలను) పంపిణీ చేయడం జరిగింది.ఈ కబడ్డీ జెర్సీలను అయిజ మండల బీజేపీ అధ్యక్షులు, దాత గోపాలకృష్ణ యువకులకు అందించారు. ఆదివారం కబడ్డీ ఆట ప్రారంభోత్సవ సమయంలో ఆయన స్వయంగా యువ క్రీడాకారులకు ఈ జెర్సీలను అందజేశారు.ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ, నేటి యువత చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచడమే కాకుండా, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి దోహదపడతాయని అన్నారు.గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదిగిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకుంటూ గ్రామ కీర్తిని పెంచాలని ఆయన బింగిదొడ్డి యువ కబడ్డీ ప్లేయర్స్‌ను అభినందించారు. గ్రామాల్లో ఇటువంటి క్రీడా కార్యక్రమాలు తరచుగా నిర్వహించడం ద్వారా యువత సరైన మార్గంలో పయనించేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కబడ్డీ క్రీడాకారులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దాత గోపాలకృష్ణ కి కృతజ్ఞతలు తెలిపారు.

## రిటైర్డ్ ఉద్యోగస్తులను గాలికి వదిలిన రాష్ట్ర ప్రభుత్వం

### - ఆల్ మెవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫరూక్ హుస్సేన్



**పాలమూరు సూర్య న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల్లో మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాయమాటలు చెప్పి అధికారం చేపట్టగానే రిటైర్డ్ ఉద్యోగస్తుల యొక్క సమస్యలను పట్టించుకోవడంలేదని వారిని గాలికి వదిలేసిందని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫరూక్ హుస్సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్ ఆర్ గార్డెన్ కన్వెన్షన్ హాల్లో జరిగిన కోయిలకొండ మండలం చింతల తండా ప్రాథమిక పాత శాల ఉపాధ్యాయులు గోవర్ధన రాజు ఉద్యోగ విరమణ సన్మాన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీ మావిళ్ళ లక్ష్మణ్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫారుక్ హుస్సేన్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా రిటైర్మెంట్ అయినఉద్యోగుల పెన్షన్ బకాయిలను నేటి వరకు ఇవ్వ లేదని , ఫలితంగా ఉద్యోగులు తీవ్ర అవస్థల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ అప్పులు, కుటుంబ పోషణ, ఇతర ఆర్థిక సమస్యలతో తీవ్ర అవస్థలు ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఆరోగ్య మానసిక సమస్యలతో ఎంతోమంది రిటైర్డ్ ఉద్యోగులు పిట్టల్లా రాలిపోతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పట్ల పూర్తిస్థాయి బాద్యత తీసుకోవాలని, వెంటనే రిటైర్ ఉద్యోగస్తులకి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు ఏక మొత్తంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చింతల బాలయ్య టిఎన్ యూ ఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, కోశాధికారి శ్రీనివాసులు,పట్టణ అధ్యక్షులు నరసింహులు, లింగమయ్య గౌడ్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

**పాలమూరు సూర్య న్యూస్:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా నవంబర్ 3న విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నామని విద్యుత్ వినియోగదారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ శాఖ ఎస్ ఈ పి.వి.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మహబూబ్నగర్ సర్కిల్, జడ్చర్ల డివిజన్, రాజాపూర్ దేవరకద్ర సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో జరిగే కార్యక్రమంలో వినియోగదారులు, రైతులు పాల్గొనాలని,సిజిఆర్ఎఫ్ విద్యుత్తు బంబుడస్ మెంట్, శాఖల వివరాలు, విద్యుత్ కనెక్షన్లు,విద్యుత్తు ఆదా చేయడం, నాణ్యమైన విద్యుత్ పరికరాలు వాడటం,విద్యుత్ టారిఫ్లు,తదితర సమస్యలను ఫిర్యాదు ద్వారా అందించి పరిష్కారం పొందాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి కర్రోళ్ల స్వప్న భాస్కర్ ఆర్థిక సాయం



**గోపాలపేట, సూర్య :** మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీకి చెందిన బోడోల్ల పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి కర్రోళ్ల స్వప్న భాస్కర్ మానవ దృక్పథంతో 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికిఅందజేశారు ఈ కార్యక్రమంలో ఏం కర్రీగల్ల బాలస్వామి కర్రోళ్ల కుర్మయ్య యా ప చెట్టు రాజన్న నాగన్న రాజు నాగరాజు వెంకటయ్య రాములు లక్ష్మణ్ రాజు తదితరులున్నారు.

## మార్కెట్ కు13,175 మొక్కజొన్న బస్తాలు

**నవాబుపేట్ సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు భారీగా మొక్కజొన్న రావడం జరిగింది.ఆదివారం ఒక్కరోజే రైతులు13,175మొక్కజొన్న బస్తాలను తీసుకురావడం జరిగింది.మొక్కజొన్న ధాన్యం క్వింటాకు గరిష్టంగా రూ.2,105ధర లభించినట్లు,క్వింటాకు కనిష్టంగా రూ.1,502ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్ కుమార్ తెలిపారు.

## వైభవంగా సంతోషిమాత ఆలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

- **సంతోషిమాతను పూజిస్తే గణపతి అనుగ్రహం సిద్ధిస్తుంది.**
- **శాస్త్రోక్తంగా గణపతి గాయత్రి హెూమాలు, అభిషేకాలు ,కుంకుమ అర్చనలు**
- **మహిళా భక్తులచే లలిత సహస్ర పారాయణ పఠనం**





**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ సూర్య న్యూస్ :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో గల శ్రీ సంతోషిమాత దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగినట్లు ఆలయ ప్రధాన అర్చకులు అల్లాడి ప్రకాష్ శర్మ తెలిపారు. కార్తిక శుద్ధ ద్వాదశి రోజు ఆలయంలో సంతోషిమాత అమ్మవారికి బ్రహ్మ ముహూర్తంలో భక్తులచే పంచ విశేష అమృత ద్రవ్యాలతో అభిషేక పూజలు జరిగాయి. గణపతి,గాయత్రి,దుర్గా హెూమాలు వేద మంత్రోచ్ఛరణల మధ్య వేదమూర్తులను బ్రాహ్మణులచే నిర్వహించారు. భక్తులు సంతోషిమాత అమ్మవారిని పూజిస్తే గణపతి స్వామివారి కృపాకటాక్షాలు విశేషంగా లభ్యమవుతాయని వారు తెలిపారు.లలిత సహస్ర పారాయణ కమిటీ మహిళా భక్తులచే లలిత సహస్ర పారాయణము మణిద్వీప వర్ణన, లింగాష్టకంతో సామూహికంగా పారాయణ పఠనం చేశారు. ఆలయఆవరణలో మహిళ భక్తులచే సామూహిక కుంకుమార్చన ప్రత్యేకంగా నిర్వహించారు. నాగర్ కర్నూల్ పట్టణం మరియు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారికి వడి బియ్యాన్ని వడి నింపి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి విశేష నైవేద్యాలు సమర్పించారు. మహా మంగళహారతి నిర్వహించి వేద ఆశీర్వచనం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు సామూహిక అన్న ప్రసాద పంపిణీ చేశారు. 9 జంక్షన్ నుండి హౌసింగ్ బోర్డ్ ప్రధాన విధుల గుండా అమ్మవారిని భజనలు కోలాటాలతో శోభయాత్రతో ఊరేగింపు చేశారు. ఓం శ్రీరక్షా కోలాట బృందం వారిచే విజయదుర్గ నవదుర్గ నాటక ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లిపెద్ది భాగ్యమ్మ ప్రభాకర్, రాచర్ల శివకుమార్ అరుణ, మిడిదొడ్డి శ్రీదేవి శ్రీనివాసులు, పి.రాజేశ్వరి సురేందర్, మొల్గర వేణుగోపాల్ రావు ,రవికాంత్ రావు,కోదండరామ శర్మ, అనంత రామ్ శర్మ, ప్రదీప్,భక్తులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత కృత్రిమ పాదాలు ఎంపిక శిబిరానికి విశేష స్పందన




**పాలమూరు సూర్య న్యూస్:** తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ లిటిల్ స్కాలర్స్ స్కూల్ ఇండోర్ స్టేడియం లో నిర్వహించిన దివ్యాంగులకు కృత్రిమ పాదాలు ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేసిన ఎంపిక శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాల నుండి దివ్యాంగులు తరలి వచ్చారు. నిర్వాహకులు దివ్యాంగులకు అవసరమైన పాదాలను పంపిణీ చేసేందుకు కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు నిర్వాహకులు కలకొండ సంపత్ ఎగిరే ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ తాము చేపట్టిన కార్యక్రమానికి దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని, దివ్యాంగ మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు సైతం పాల్గొన్నారని తెలిపారు. డాక్టర్ విజయ్ పాల్ రెడ్డి కుటుంబ సభ్యులు గుడి గోపురం మట్టారెడ్డి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు కృత్రిమ పాదాలు ఉచితంగా అందించనున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగిన శిబిరంలో హాజరైన వారికి భోజన వసతి తో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## వెయ్యేళ్ల నాటి పాదాలు, లింగాలను కాపాడుకోవాలి

### - పురావస్తు పరిశోధకుడు డా.ఈమని శివనాగిరెడ్డి



అచ్చంపేట, సూర్య న్యూస్ : అచ్చంపేట మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండనాగుల గ్రామం శివారులో శివాలయం ముందున్న బండపై చెక్కిన పాదాలు, శివలింగాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకులు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి అన్నారు. స్థానిక గంగాగౌరీ రామలింగేశ్వరాలయ కమిటీ అధ్యక్షులు అంబటి లింగమయ్య ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం నాడు ఆయన శివాలయం ముందు బండ పై పాదాలు, ఆరు చిన్న శివలింగాలు చెక్కి ఉన్నాయని, అవి కళ్యాణీ చాళుక్యుల (సా.శ. 11వ శతాబ్దం) కాలం నాటివని, చరిత్ర పై అవగాహన లేని క్వారీ పని వాళ్ల వల్ల ముప్పు ఏర్పడుతుంది అని, చరిత్రక ప్రాధాన్యత గల ఈ శిల్పాలను కాపాడి భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాట్రాజు తిరుపతయ్య, అంబటి నరసింహ, నిమ్మల రాజు, తెలుగు ఎల్లయ్య, శిల్పి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనకై రాజీలేని పోరాటాలు .

- **ఏఐటియుసి ఆలేరులో ఘనంగా 106 వ ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు.**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్**



**నాగర్ కర్నూల్ , సూర్య న్యూస్:** ఆలేరు గ్రామంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ (కాంగ్రెస్)106 వ ఆవిర్భవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మరియు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ హాజరై మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ముంబై మహానగరంలో లాలా లజపతిరాయ్, నారాయణ మల్హార్ జోషి, డివాన్ చామన్ లాల్, జోసెఫ్ బాప్టిస్టా, బిపిన్ చంద్రపాల్ నాయకత్వాన ఏ ఐ టి యు సి స్థాపించబడి అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ దేశ స్వాతంత్ర పోరాటంలోను, అనేక సంస్థల్లో జరిగిన పోరాటంలోను కార్మిక లోకాన్ని ఏకం చేసి కదిలించింది. నూట ఐదేళ్ళ సుదీర్ఘ పోరాటంలో శ్రామిక, కార్మిక వర్గానికి ఏఐటీయూసీ భరోసాగా నిలిచింది, అని ఆయన అన్నారు.కార్మికుల పక్షాన ఏఐటియుసి చేపట్టిన పోరాట ఉద్యమాలతోనే అనేక హక్కులు ఏఐటియుసి సాధించబడ్డాయని, కార్మిక శ్రేయస్సు కోసం, స్వాతంత్ర్యం కోసం వీరోచిత పోరాటాలు సాగించిన చరిత్ర ఏఐటీయూసీ కి మాత్రమే ఉంది. 12 గంటలు పనిని 8 గంటలకు తగ్గించాలని, వారంలో ఒకరోజు సెలవు దినంగా ప్రకటించాలని పోరాటం చేసిన ఘనత ఎఐటిసికి దక్కిందన్నారు.చికాగో నగరంలో చిందించిన ఎర్రటి రక్తంతో ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని పిలుపు నిచ్చింది. కార్మికుల హక్కుల సాధనకు అనేక పోరాటాలు ఉద్యమాలు చేసిన సంఘం భారతదేశంలోనే మొట్టమొదటి సంఘం ఎఐటియుసిఅన్నారు.అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలలో కార్మికుల హక్కులకై పోరాటం చేసింది. పాలక ప్రభుత్వాల తీరుతో రైల్వే, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ బ్యాంకు, రక్షణ రంగాలు ప్రైవేటు పరం అయ్యాయి. పాలకుల తీరుతో పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారు. ఎన్నో త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాసే ప్రయత్నం చేస్తున్నాయని, ఆ చట్టాలను కాపాడుకునేందుకు కార్మికులు ఏఐటీయూసీ నాయకత్వంలో పోరాటాలు చేపట్టాలి. అని వారు కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి యస్ శంకర్ గౌడ్, సి పి ఐ జిల్లా సమితి సభ్యులు డి బాలమురళి కృష్ణ, సి పి ఐ పార్టీ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్ ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు అవుటవెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ జింకల ఈశ్వరయ్య, అఖిల భారత యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డి అంజి, కపిలవాయి గోపి చారి, డి బిచ్చయ్య, మల్లికార్జున్ హమాలీ సంఘం అధ్యక్షులు చెంది వెంకటస్వామి, కార్యదర్శి పిట్టల నిరంజన్, ఉపాధ్యక్షులు డి, బాల్ రాం, సహాయ కార్యదర్శి చెంది రాములు, హుస్సేన్ దంతెల సీతయ్య దొండ రాములు దస్తగిరి యాదవ్, సుల్తాన్, యాదవ్, దొండ బంగారయ్య, తదితరులున్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, పరిష్కరించడంలో భాగంగా ఈ నెల 3న సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజలు, కాల్ చేయాలనుకునే వారు ఎస్పీ ఆఫీస్ నంబర్: 0850 6281182 కు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కాల్ చేయాలని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ప్రజలతో మాట్లాడి ఫిర్యాదులు, సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి తక్షణ పరిష్కార మార్గాలను సూచిస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## నేలకొరిగిన వరి పంట-ఆందోళన లో అన్నదాతలు



**మల్దకల్ సూర్య న్యూస్:** తుపాన్ ప్రభావంతో మండల పరిధిలో కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్ర నష్టాన్ని చవి చూశారు. వరి పంటతో పాటు ఇతర పంటలు నేలమట్టమై రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట నేల కొరగడంతో చిన్న, సన్న కారు, కౌలు రైతులు ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చేటప్పటికి ప్రకృతి వైపరీత్యాలు కారణంగా ప్రతి యేటా నష్టం పోతున్నామని మల్దకల్ వీరన్న గౌడ్ అన్నారు. ముఖ్యంగా కౌలు రైతుల బాధలు వర్ణనతీతం అప్పులు చేసి పంటలు పండిస్తుంటే పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు కారణంగా ప్రతి ఏటా నష్టపోతున్నామని తెలిపారు. ఈ ఏడాది వాతావరణ అనుకూల పరిస్థితుల కారణంగా పంటలు సమఅద్దిగా పండాయాని ఆశించిన రైతులకు తుపాన్ ప్రభావంతో నిరాశ ఎదురైనది. ఈ ఏడాది ఎకరానికి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నా అన్నదాతలకు తుఫాను ప్రభావంతో చేతికి వచ్చిన పంట నేలపై ఒరిగిపోవటం తో నిరాశ చెందుతున్నారు. ఇప్పటికే ఎకరానికి 30000 రూపాయలు ఖర్చు పెట్టామని మల్దకల్ మండలం చెందిన వీరన్న గౌడ్ %వా%/0 ఆంజనేయులు గౌడ్ అన్నారు. వరి పైరు నేలకొరగడంతో కూలి రేట్లు పెరుగుతాయని ఆందోళనలో వ్యక్తం చేశారు. వ్యవసాయం చేసే కన్నా కూలికి వెళ్తే జీవితం హాయిగా కొనసాగుతుందని అన్నారు. ఆరుగాలం పండించిన పంట దళారుల జేబులు నింపుకుంటున్నారని అన్నారు.

## బాల రక్ష వాహన డ్రైవరు కు దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** నారాయణపేట జిల్లా పరిధి లో "బాల రక్ష భవనము" నకు సంబందించిన వాహనమును నడుపుటకు గాను అనుభవం గల ఆసక్తి గల డ్రైవరుల నుండి దరఖాస్తులను ఆహ్వానించనైనదనీ జిల్లా సంక్షేమ అధికారి అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను పదవ తరగతి చదివిన,అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుననీ తెలిపారు. దరఖాస్తు దారులు పదవ తరగతి సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్సు,అనుభవం సర్టిఫికేట్, స్థానికత సర్టిఫికేట్,ఆధార కార్డ్ జిరాక్స్ కాపీలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఆసక్తి గల డ్రైవరులు నిర్ణీత దరఖాస్తు ఫారంలను అన్నీ డాక్యు మెంట్స్ తో కలిపి జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం,లో మోనప్పగుట్ట దగ్గర, నారాయణపేటలో ఈ నెల 7 సాయంత్రం 5 గం. లోగా కార్యాలయ వేళలో సమర్పించలాన్నారు.

## చింత చెట్టు నుండి పడి రైతు దుర్మరణం



**ఉప్పునుంతల, సూర్య న్యూస్:** ఉప్పునుంతల మండలంలోని జప్తి సదగోడు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కోట్ల చిన్న లింగమయ్య (54) చింత చెట్టు నుండి కిందపడటం వల్ల ప్రాణాలు కోల్పోయాడు. వివరాల్లోకి వెళ్తే అక్టోబర్ 31న గ్రామంలోని దర్గా వద్ద ఉన్న చింత చెట్టు కాయలు తెంచడానికి లింగమయ్య చెట్టు ఎక్కి కాయలు తెంచుతుండగా, అకస్మాత్తుగా కాలు జారి కిందపడ్డాడు. చెట్టు కింద దర్గా గోడలు ఉండటంతో వాటిపై బలంగా పడటంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన హైద్రాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రెండు రోజులపాటు చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆయన మృతి చెందారు.మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలి

- పొలం బాటపట్టిన పీజీ విద్యార్థినీ విద్యార్థులు
- గ్రామీణ జీవనంపై పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల అధ్యయనం







**లింగాల, సూర్య న్యూస్:** గ్రామీణ ప్రాంతాలలోని రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని పీజీ విద్యార్థులు రైతులకు సూచించారు. అనునిత్యం పుస్తకాలతో కుస్తీపడే విద్యార్థులు సామాజిక అంశాలపై చైతన్యం తేవడం లక్ష్యంగా అధ్యయనం చేసేందకు పాలమూరు విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థిని విద్యార్థులు మూడు రోజుల రూరల్ క్యాంపులో భాగంగా అప్పాయిపల్లి గ్రామంలో ఉంటూ ప్రజలను చైతన్యవంతులు చేసే కార్యక్రమాలను చేపట్టి ప్రజలతో మమేకమయ్యారు. ఆదివారం గ్రామంలో గ్రామంలో కాలినడకన ఇంటింటికి తిరుగుతూ ప్రజల జీవన విధానంపై ఇంటింటి సర్వే నిర్వహించారు. వ్యాధులు, పోషకాహార లోపం, మత్తు పదార్థాలపై కలిగే పల్లెవాసులకు అవగాహన కల్పించారు. అనంతరం పొలం బాట పట్టిన విద్యార్థులు ఆధునిక వ్యవసాయతో కలిగే ప్రయోజనాలను రైతులకు, గ్రామస్తులకు వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మకమైన మార్పుల వల్ల వ్యవసాయ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు చోటు చేసుకుంటున్నయని వాటిని తెలుసుకోవాలన్నారు. రైతులు రసాయనకి ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా పంట దిగుబడి కూడా తగ్గిపోతుందని అన్నారు. రైతులు నవీన పద్ధతుల ద్వారా పంటలను సాగు చేయాలని సూచించారు. భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా మేలైన పంటలను ఎన్నుకోవచ్చు అన్నారు.రసాయనాల వినియోగంతో కలిగే నష్టాలు, సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు డాక్టర్ బి. పర్వతాలు డాక్టర్ యం. గాలెన్న, సోషల్ వర్క్ విద్యార్థిని విద్యార్థులు మచ్చేందర్, రాజేష్, ఎన్. శంకర్, ప్రశాంత్, గోపాల్, రాకేష్ బుగ్గప్ప, స్వప్న, విజయ, ఆశమ్మ, స్వాతి మహేశ్వరి,అనూష, తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో లేని- పశువైద్యశాల డాక్టర్



**మల్దకల్ సూర్య న్యూస్:** ఉదయం 11 గంటలు దాటిన పశువైద్యశాల తెరుచుకోలేదు. దీంతో పశువులకు వైద్యం కోసం వచ్చిన రైతులు వైద్యశాల వద్ద వేచి చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో పశు వుల వైద్యశాల ఎప్పుడు తేర్చుకుంటాదో, ఎప్పుడు మూసి పోతారో, డాక్టర్ లు సమయపాలన పాటించకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పశు వైద్యశాలలో ఒక్క డాక్టర్ నిత్యం అందుబాటులో ఉండి. రైతుల తీసుకొని వచ్చిన పశువులకు సకాలంలో వైద్యం చేసి ఆదుకోవాలి, కానీ ఇక్కడ మాత్రం ఎప్పుడూ చూసినా పశువైద్యశాల తాళం వేసి ఉంటుందని, రైతులు దిగులు చెందుతున్నారు. పశువులకు ఏదైనా రోగం వచ్చి ఇక్కడికి తీసుకొని వస్తే, ఇక్కడ మాత్రం వైద్యం అందక అందని ద్రాక్ష గానే మిగులుతుందని, రైతులు బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని అంటున్నారు. బిజ్వారం, మేకల సొంపల్లి, దాసరిపల్లి, ఉలిగేపల్లి గ్రామాల చెందిన రైతులు వ్యవసాయంతో పాటు పశువుల పోషణ పై ముందు చూపు లేకపోవడంతో గ్రామాలలో రోజురోజుకు పాడి పరిశ్రమ తగ్గిపోతుందని చెప్పవచ్చు, ఒకవైపు వర్షాకాలం, మరొకవైపు చలికాలం కాబట్టి పశువులు దోమలతో రోగాల మృత్యువాత పడుతుంటే దానికి తోడు పశు వైద్యశాలలో డాక్టర్లు లేకుండా పోతున్నారని, దీంతో రైతులకు న్యాయం జరగలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో వైద్యులు ఉండాల్సింది పోయి ఇన్చార్జిలతో కాలం వెళ్లదీస్తున్నారని చెప్పవచ్చు, వారు కూడా ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియకుండా ఉందని దీంతో పశు వుల కు రోగం వస్తే సరైన సమయంలో వైద్య అందక చనిపోతున్నాయని రైతులు దిగులు పడుతున్నారు. దీంతో జిల్లా అధికారులు, మండల అధికారులు చొరవ తీసుకొని పశువైద్యశాలలో వైద్యులు ఉండేటట్లు చూడాలని పాడి రైతులు కోరుతున్నారు.

## ఊట్కూర్ రైల్వే స్టేషన్ సాధనకై సమిష్టిగా కృషి చేద్దామని అఖిలపక్ష నిర్ణయం



**ఊట్కూర్ సూర్య న్యూస్ :** ఊట్కూర్ మండల కేంద్రంలో ఆదివారం రైల్వే స్టేషన్ సాధనకై అఖిలపక్ష నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే స్టేషన్ సాధన సమితి అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, విగ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఊట్కూర్ రైల్వే స్టేషన్ ఏర్పాటు వల్ల మండలంలోని 28 గ్రామాలతో పాటు కర్ణాటకలోని 10 గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు జీవనోపాధికై వెళ్లి స్థిరపడ్డారని, రైల్వే స్టేషన్ ఏర్పాటుతో ఆ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. గతంలో విడుదలైన డీపీఆర్‌లో ఊట్కూర్ స్టేషన్ ఉండగా, తాజా డీపీఆర్‌లో హాల్ట్‌గా మాత్రమే పేర్కొనడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రైల్వే స్టేషన్ సాధనకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్ లోగోను విడుదల చేశారు. సమావేశంలో ఏకగ్రీవంగా రైల్వే స్టేషన్ సాధన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, విగ్నేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు హుస్నాబాద్ పాషా, వెంకటరామారెడ్డి, జావిద్, సూర్య ప్రకాశ్ రెడ్డి, యం గోపాల్ రెడ్డి, అడ్వకేట్ భరత్, మక్బూల్, దొబ్బలి హనుమంతు, గంగాధర్, జి రమేశ్, కార్యదర్శులు దశరథ్, కొండను గోపాల్, సి ఆనంద్, సమీవుల్లా, డాక్టర్ రఘు, బాల ఆంజనేయులు, వడ్ల మోనప్ప, భరత్, బి నారాయణ, కృష్ణ గౌడ్, వెంకటేష్ గౌడ్, అనిల్, కోశాధికారి గరిడీ లక్ష్మారెడ్డి తదితులు సభ్యులుగా ఎంపికయ్యారు.

## మాదాసి కుర్వ ఎస్సీ ధ్రువీకరణపై అంబేద్కర్ సంఘం ఆందోళన



**ఊట్కూర్ సూర్య న్యూస్ :** ఊట్కూర్ అంబేద్కర్ కళాభవన్ వద్ద ఆదివారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాదాసి కుర్వ కుల ధ్రువీకరణ పత్రాల జారీపై తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. సంఘ అధ్యక్షులు కొక్కు శంకర్, ప్రధాన కార్యదర్శి కొండన్ భరత్ మాట్లాడుతూ మండలంలోని కొంతమంది మాదాసి కుర్వ వ్యక్తులు అక్రమంగా ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మాదాసి కుర్వ అనే ఎస్సీ కులం లేదని, వారు బీసీ సామాజిక వర్గానికి చెందినవారని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించి, మాదాసి కుర్వను బీసీ కులంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది ప్రజలు అవగాహన లోపంతో తప్పుదోవ పట్టిస్తున్నారని, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నారాయణ, మాజీ సంఘ అధ్యక్షులు ఆర్. దశరథ్, ఉపాధ్యక్షులు బక్కి తిమ్మప్ప, కోశాధికారి లావరీ బలరాం, కమిటీ సభ్యులు మహదేవ్ నాయుడు, అంబ్రిష్, నరసింహులు తదితులు పాల్గొన్నారు.

## మంగళవారం నాడు రాజమురయ్య దేవస్థానం నుండి లడ్డు పులిహోర ప్రసాదాలు వేలంపాట ఆలయ చైర్మన్. ఈవో. శ్యామ్ సుందర చారి



**దేవరకద్ర సూర్య న్యూస్ :** దేవరకద్ర మండల పరిధిలోని చినరాజమూర్ ఆంజనేయస్వామి దేవస్థానం నుండి నెలరోజులపాటు కొనసాగే రాజమురుయా బ్రహ్మోత్సవాలు జాతర సందర్భంగా. ఈసారి దేవస్థానం నుండి లడ్డు పులిహోర ప్రసాదాలు వేలంపాట మంగళవారం రోజు నాడు కొనసాగుతాయని. ఆలయ చైర్మన్ గోపాల చారి . ఈవో శ్యాంసుందర్ చార్యులు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేత



**దేవరకద్ర, సూర్య న్యూస్ :** దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాల మేరకు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోన రాజశేఖర్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ గ్రామానికి చెందిన హరిజన్ ముక్కిడి బచ్చన్న అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని సమాచారం అందడంతో కోన రాజశేఖర్.స్పందించారు. మృతుడి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సాయం ఆయన తరపున బాలకృష్ణ ద్వారా బచ్చన్న కుటుంబానికి. ఇవ్వడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్, రాజు గౌడ్, నక్క ఆంజనేయులు, కటిక అబ్దుల్, ఖాజా పాషా, మోహన్, ఆంజనేయులు, బాలప్ప, శాంతప్ప, వెంకటయ్య, రాజన్న, కొత్తూరు తిరుపతయ్య, బుచ్చన్న పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి. మంత్రి మరియు ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం మాజీ సర్పంచ్ బలుసుపల్లి శంకర్



**దేవరకద్ర సూర్య న్యూస్ :** దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో బలుసుపల్లి గ్రామానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గ్రామానికి సంబంధించి పార్కుల సుందరీ కరణ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ఆడుకునేందుకు క్రీడామైదానం ఆహ్లాదకరంగా కనిపించే పార్కు మొదటిసారిగా ఒకకోటి 50 లక్షల రూపాయలతో నిధులు మంజూరు చేసినా సందర్భంగా . కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి మరియు మంత్రి వాకిటి శ్రీహరి.దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ మధుసూదన్ రెడ్డి గారికి మా బలుసుపల్లి గ్రామం నుండి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బలుసుపల్లి గ్రామం మాజీ సర్పంచ్ వారు అన్నారు.

## ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలోవరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**మదనాపురం సూర్య :** మదనాపురం మండలంలోని ద%శీ%తనూర్ మరియు శంకరమ్మ పేట గ్రామాలలో మార్కెట్ కమిటీ చెర్మెన్ పల్లెపాగ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఐకేపీ మహిళా సంఘాలు డి ఆర్ డి ద్వారా వానాకాలం (ఖరీఫ్) సీజన్ 2025-26 కు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ వైస్ చెర్మెన్ తిరుపతి రెడ్డి మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేశారు. ఇట్టి కార్యక్రమంలో మండల అధ్యక్షులు గజ్జెల నాగన్న , దంతనూర్ గ్రామ పార్టీ అధ్యక్షులు వెంకటన్న , శంకరంపేట గ్రామ అధ్యక్షులు కృష్ణయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన బీఆర్ఎస్ యువకులు



**కృష్ణ సూర్య న్యూస్ :** మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి సత్య నారాయణ ఇటీవల మరణించిన సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మ్యాకల్ భీమ్,తంగిడి చిన్న ఆదివారం హైదరాబాద్ లోని నివాసంలో మాజీ మంత్రి ని మర్యాద పూర్వకంగా వారు కలిశారు. ఆనంతరం ఆయన తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి పవిత్ర ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# కౌండిన్య మహర్షి జయంతికి జిల్లా గౌడ కులస్తులు పాల్గొనాలి



**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ సూర్య న్యూస్ :** నవంబర్ 5న కార్తీక పౌర్ణమి నాడు ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే కౌండిన్య మహర్షి జయంతి కార్యక్రమానికి నాగర్కర్నూల్ జిల్లాలోని గౌడ కులస్తులు హాజరుకావాలని జై గౌడ్ ఉద్యమం నాగర్ కర్నూల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు కాటగౌని హరీష్ గౌడ్ లు కోరారు. జై గౌడ్ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణ గౌడ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మొల్గర రమేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో ఆదివారం నాడు కరపత్రాన్ని గౌడ సంఘం భవనంలో విడుదల చేశారు.కౌండిన్య మహర్షి యొక్క ఆశయాలను సమాజంలో విస్తరింప చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సింగారి జ్యోతి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పలుస నిర్మల గౌడ్,బిజినపల్లి మండల అధ్యక్షుడు అల్వాల రంజిత్ గౌడ్, పలుస అజయ్ గౌడ్, సుప్రియ గౌడ్ పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్ రవితేజకు ఘనంగా సన్మానం



**మక్తల్ సూర్య న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో ఎంపికై సూర్యాపేట జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రవితేజకి మక్తల్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. తమ అమ్మమ్మ గ్రామమైన మక్తల్‌కు వచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.డిప్యూటీ కలెక్టర్ రవితేజతో పాటు, ఆయన ఈ స్థాయికి రావడానికి వెన్నుదన్నుగా నిలిచిన వారి అమ్మ అరుణమ్మ, తాతయ్య రిటైర్డ్ ఎస్డబ్ల్యూఓ రామచంద్రప్ప, కుటుంబ సభ్యులు గుడిగండ్ల నర్సిములును కూడా ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల నుండి కష్టపడి చదివి ఉన్నత స్థాయి అధికారిగా ఎదిగిన రవితేజని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.నాయకులు మాట్లాడుతూ మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే, అంబేద్కర్ కోరుకున్న ఆశయాల మార్గంలో సమాజంలోని దళిత, బహుజన, బలహీన, పేద వర్గాల ప్రజల విద్య, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తూ, 'పేదల కలెక్టర్'గా ప్రసిద్ధి చెందిన ఎస్ఆర్. శంకరన్ లా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. సన్మానం అనంతరం డిప్యూటీ కలెక్టర్ రవితేజ మాట్లాడుతూ అంబేద్కర్, ఫూలే తనకు స్ఫూర్తి అని, తప్పకుండా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మక్తల్ ప్రధాన కార్యదర్శి బండారి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గోలపల్లి నారాయణ, కోరి మారెప్ప, కెవిఎస్పిఎస్ నాయకులు బండారి నర్సప్ప, మల్లేపల్లి రవి, పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి, స్వేరో రవికుమార్, అంబేద్కర్ యువజన సంఘం సహాయ కార్యదర్శి రవి కుమార్, కోశాధికారి త్రిమూర్తి, కార్యవర్గం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారం గ్రామస్తులు బిఆర్ఎస్ నుంచి బిజెపి లో 80 మంది చెరికను ఖండిస్తున్నాం. మాజీ సర్పంచ్ ముగ్దం రమేష్ యాదవ్



**రేవల్లి (ఏదుల) మేజర్ న్యూస్ :** హైద్రాబాద్ రాష్ట బీజేపీ కార్యలయంలో ఆదివారం రోజు చెన్నారం గ్రామస్తులు బిఆర్ఎస్ నుంచి బిజెపి లో 80 మంది చేరిక అనేది తప్పుడు సమాచారం గ్రామ మాజీ సర్పంచ్ ముగ్దం రమేష్ యాదవ్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గ్రామనికి చెందిన ఒక్క వ్యక్తి ని టిఆర్ఎస్ పార్టీ అని చెప్పినా ఎవరు నమ్మరని, గత ఎన్నికల్లో ఎవరికీ ప్రచారం చేశాడో గ్రామ ప్రజలకు బాగా తెలుసు, అలాంటి వ్యక్తి నే ఈ వెంకటపతి రాజు అని, అతనిని నిజం గా దైవం పై భక్తి ఉంటే అతడు గత ఎంపిటిసి ఎన్నికల్లో, ఎమ్మెల్యే ఎన్నికల్లో అదేవిధంగా ఎంపీ ఎన్నికల్లో ఏ పార్టీ లో ఉండి ఏ పార్టీకి ప్రచారం చేసి ఏ పార్టీకి ఓటు వేశాడో అతని మనసు సాక్షిగా చెప్పుతే తెలుస్తుందని,అతను టిఆర్ఎస్ పార్టీ లేక వేరే ఇతర పార్టీ అనేది తెలుస్తుంది. అక్కడ ఉన్న వారిలో చెన్నారం గ్రామ వ్యక్తి వెంకటపతి రాజు, మీగతా 80 మంది చెన్నారం వ్యక్తులను ఎప్పుడు మేము, మా గ్రామస్తులు చూడలేదు. వారు హైదరాబాద్ లో ఉండే గ్రామానికి సంబంధం లేని వ్యక్తులు అలాంటి వ్యక్తులను బిఆర్ఎస్ పార్టీ వాళ్లు అని తప్పుడు ప్రచారం చేయాటాని చెన్నారం గ్రామం బి ఆర్ ఎస్ పార్టీ నుంచి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** పదో తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థులంతా 25 ఏళ్ల తర్వాత ఒక చోట చేరి సందడి చేశారు. ఆదివారం మహబూబ్ నగర్ గ్రామీణ మండలం జమిస్తాపూర్ లోని సయ్యద్ ఫాం హౌజ్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రాంనగర్ ఉన్నత పాఠశాలలో 1998%-%99 పదో తరగతి చదువుతున్న 50 మందికి పైగా విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు క్యాథరిన్, లలిత, రామచంద్రమ్మ, రామకృష్ణ, రఘురాంరెడ్డి, ఖాద్రీ, వెంకటేశ్వర్లు, మురళీధర్, తదితరులను పిలిచి ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు నాటి రోజులను గుర్తుచేసుకొని ఓల్డ్ ఈజ్ గోల్డ్ అనే మాట మరోసారి నిరూపితమైందని కొనియాడారు. ఉదయం పూట అధ్యాపకుల ప్రసంగాలతో భావోద్వేగంగా సాగిన ఈ కార్యక్రమల సాయంత్రం విద్యార్థుల సందడి, డ్యాన్స్ లతో సరదాగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు బాలకృష్ణ, నాగరాజు, మోహన్, శేఖర్, మహేష్, నవీన్, అమీరాఖాన్, మల్లేష్, సత్యమ్మ, మంజుల, అంజమ్మ, గాయత్రి, అన్నపూర్ణ, వరలక్ష్మీ, కల్పన, పారిజాత, సుచరిత, రహెమాన్, సుధాకర్, కిషోర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కురుమయ్యను దర్శించుకున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దంపతులు





**చిన్నచింతకుంట సూర్య న్యూస్ :** తెలంగాణ పల్లె ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి ఆదివారం కార్తీక మాసం ప్రభుత్వ సెలవు దినం కావడంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి దంపతులు శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు కొండపై గల ముఖద్వారం వద్దకు రాగానే ఆలయ అర్చకులు మంగళ వాయిద్యా లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు స్వామివారికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి దంపతులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు చెన్నకేశవ స్వామి ద్వార పాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి ఈవో మదనేశ్వర్ రెడ్డి అర్చకులు తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం.



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** కల్వకుర్తి మండల పరిధిలోని పంజుగుల గ్రామానికి చెందిన జక్కుల బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న ఉప్పల చాటబుల్ ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తక్షణసాయంగా 3వేల రూపాయల నగదును తన అనుచరుల ద్వారా అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనాయకులు దారమోని గణేష్, మాజీ వార్డు సభ్యులు ఖాజా, ఇప్ప సాయిబాబు, పెద్దరాజు చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీను, సురేందర్, మేస్త్రి శ్రీను తదితరులు ఉన్నారు.

## బాలోత్సవ కమిటీ పిల్లల జాతరను జయప్రదం చేయండి.

### బాలోత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ టి. చెన్నయ్య.



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** కల్వకుర్తి పట్టణంలో నవంబర్ 20వ తేదీన జరిగే బాలోత్సవ కమిటీ పిల్లల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ టి. చెన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరవుతారని తెలిపారు, ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్ ను విడుదల చేశారు, ఈ కార్యక్రమంలో యూపీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు ఏపీ. మల్లయ్య, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, కిషోర్ ,రామేశ్వరయ్య, ఆంజనేయులు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## తీరనున్న మద్దెల బండ రోడ్డు కల...

### - ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన వైస్ ఎంపీపీ వీరన్న..



**మల్దకల్ సూర్య న్యూస్:** ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న రోడ్డు కల తీరనుంది. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామం నుంచి గట్టు మండలం ఆరగిద్ద వరకు 60 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు కానున్నాయి. ఈనెల ఒకటవ తేదీన (శనివారం) గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా సి.సి రోడ్డు భూమి పూజ శంకుస్థాపన చేస్తుండడంతో గ్రామ ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు.
ం-రోడ్డు నిర్మాణం సంతోషకరమని మండల వైస్ ఎంపీపీ వీరన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: గత బిఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వంలో రోడ్డు సరిగలేక దశాబ్ద కాలం పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే సహకారంతో గ్రామానికి 60 లక్షల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## వలస బతుకు పుస్తకం ఆవిష్కరణ హాజరైన హైకోర్టు జడ్జి సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న....





**మరికల్ సూర్య న్యూస్:** మరికల్ మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్ లో ఆదివారం రోజు పి. వెంకట్ రాములు ఆధ్వర్యంలో వలస బతుకులు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు జడ్జి సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్సీ గోరేటి వెంకన్నలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలసలపై పుస్తకను మహా అద్భుతంగా రాశారని వారు అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ పుస్తకం ను చదవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హరగోపాల్, హైమావతి, సుదర్శన్, సూర్య మోహన్ రెడ్డి, వెంకట్ రాములు, ప్రభాకర్, శ్రీనివాసులు, మరికల్ మాజీ సర్పంచులు లక్ష్మయ్య, లక్ష్మీ రామస్వామి, నాయకులు మేధావులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ఐజేయూ నిరంతర కృషి

- అతి త్వరలో అక్రెడిటేషన్ కమిటీ సమావేశాలు
- నెలాఖరులోగా మహబూబ్నగర్ జిల్లా మహాసభ
- టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ వెల్లడి




**మహబూబ్ నగర్ సూర్య ప్రతినిధి:** గత ఆరు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుల పక్షాన నిలబడి, వారి సంక్షేమానికి నిరంతరంగా పాటుపడుతున్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే(ఐజేయు) అని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అన్నారు. మహబూబ్నగర్ ప్రెస్ క్లబ్లో యూనియన్ జిల్లా నాయకులతో జిల్లా మహాసభ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన అక్రెడిటిషన్లకు సంబంధించి అతి త్వరలోనే రాష్ట్రస్థాయిలో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో జర్నలిస్టులకు ఒక అద్భుతమైన హెల్త్ పాలసీని తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్నగర్ జిల్లాలోనూ యూనియన్ లో పెద్ద ఎత్తున చేరికలు ఉన్నాయని, ఈ నెలాఖరులోపే జిల్లా మహాసభను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శిని యూనియన్ జిల్లా నాయకులు శాలువా కప్పి సన్మానించారు. అంతకుముందు మహబూబ్నగర్ జిల్లాకు విచ్చేసిన యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాజీద్ ను రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ గౌడ్, సతీష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కాటం నాగరాజుగౌడ్, గోకులం వెంకటేష్, విజయ్, నగేష్, హుస్సేన్, మిరాజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా 3 గంటలు అంత రాయం

**చిన్న చింతకుంట సూర్య న్యూస్** మండల కేంద్రంలోని 33/11 కె.వి ఉపకేంద్రంలో అల్లిపూర్ మద్దూర్ గ్రామాలకు నూతన 11 కెవి బ్రేకర్ మరమ్మత్తుల కారణంగా సోమ వారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 2:30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ సురేష్ బాబు తెలిపారు 11 కెవి బ్రేకర్ మరమ్మత్తుల కారణంగా చిన్నచింత కుంట మండల కేంద్రం తోపాటు ఎద్దులాపూర్ మద్దూర్ ఉంద్యాల అల్లిపూర్ లక్ష్మీదేవిపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు గ్రామాల ప్రజలు వినియోగదారులు వ్యాపారస్తులు సహకరించాలని ఏఈ తెలిపారు.

## 4 న ఛలో హైదరాబాద్

- తెలంగాణ రాష్ట్ర రెడ్ల సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష
- రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ కింది మాధవరెడ్డి



**నాగర్ కర్నూల్.ఎడ్యుకేషన్ సూర్య న్యూస్ :** గత పది సంవత్సరాల నుండి రెడ్ల సంక్షేమం, ఐక్యత, రిజర్వేషన్, తదితర సమస్యలపై ఉద్యమాలు చేస్తున్న. తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 4 న ఉదయం 11 గంటలకు ఇందిరా పార్కు హైదరాబాద్ నడిఒడ్డున రెడ్ల నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ కింది మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన డిమాండ్లు ఈడబ్ల్యూఎస్ వర్గాలకు టెట్ లో 90 మార్కుల నుండి 75 మార్కులకు తగ్గించాలి. అన్ని పోటీ పరీక్షలలో వయోపరిమితి సడలించాలి, రెడ్డి కార్పొరేషన్ పాలకవర్గం మరియు నిధులు మంజూరు చేయాలి, ఈడబ్ల్యూఎస్ బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి, విద్యా- ఉద్యోగ అర్హత పరీక్షలకు రుసుము తగ్గించాలి, చట్టబద్దతతో కూడిన ఈడబ్ల్యూఎస్ కమీషన్ ఏర్పాటు చేయాలనీ తదితర డిమాండ్లను అమలు పర్చాలని నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి రెడ్ల సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

## రాజ్యాంగ రక్షణ సభను జయప్రదం చేయాలి.



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** ఈనెల 26న ఢిల్లీలో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రాజ్యాంగ రక్షణ సభను జయప్రదం చేయాలని జాతీయ మాల మహానాడు నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రావుల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాలా గ్రామంలో ఆ గ్రామ అధ్యక్షులు డాన్స్ రాజ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన హలో మాల చలో ఢిల్లీ కరపత్రాల రిలీజ్ కార్యక్రమానికి రావుల శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, బహుజనలు రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు, రాజ్యాంగాన్ని తూట్లు పొడిచి మనకు రావలసిన వాటాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని, ఇకనైనా బహుజనులు మేల్కోవాలని పిలుపునిచ్చారు, రాజ్యాంగ రక్షణ సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శ్రీనివాసులుక కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రామ బాలరాజు, కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు సామ నాగరాజు, గ్రామ కార్యదర్శి వెంకటేష్, మాల మహానాడు నాయకులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

## ఈనెల 3న విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించుకోండి. ఏడిఈ శంకరయ్య.



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** ఈనెల 3న విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకోవాలని కల్వకుర్తి ఏడిఈ శంకరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో నవంబర్ 3న ఉదయం 11 గంటలకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం ఏర్పాటు చేస్తున్నట్లు ఏడిఈ శంకరయ్య తెలిపారు, విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని శంకరయ్య పేర్కొన్నారు, కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, చారకొండ, ఊరుకొండ మండల విద్యుత్ వినియోగదారులందరూ పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయండి.

**ఉండవెల్లి సూర్య న్యూస్ :** ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన గిట్టుబాటు ధర ప్రకారం రైతు నుంచి నేరుగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. భారీ వర్షాల ప్రభావం వల్లదిగుబడులు తగ్గి నష్టాన్ని చవిచూసే పరిస్థితులు కనబడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. గత సంవత్సరం మాదిరిగా ఖరీఫ్ సీజన్ పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రం ఏర్పాటు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు నడిగడ్డ ప్రాంతంలో మొక్కజొన్న పంట ప్రాధాన్యత ఉంటుందని బయట అమ్ముకుంటే రైతులకు నష్టాలు ఏర్పడతాయని ప్రభుత్వం కేంద్రాన్ని ఏర్పాటు చేసే రైతులను ఆదుకోవాలని కోరారు. జోగులాంబ గద్వాల జిల్లా లో సుమారు 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు అయినట్లు అధికారులు వెల్లడించారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



**దామరగిద్ద సూర్య న్యూస్ :** మండల పరిధిలోని క్యాతన్ పల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్ మనుమరాలు విజయలక్ష్మి ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా టిడిపి పార్టీ తరఫున ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పార్లమెంటు నియోజకవర్గ హడక్ కమిటీ సభ్యుడు రాములు యాదవ్ ఆమెను ఘనంగా సన్మానించి,అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో మంచి డాక్టర్ అయిన తరువాత ప్రజలకు మంచి వైద్యం అందించి,ప్రజల మన్ననలు పొందాలని,అలాగే తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో మొగులప్ప, నారాయణ ,అశోక్, నారాయణ గౌడ్ ,వేంకటప్ప ,రాజు, వేంకట్రాములు ,వేంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతే నా లక్ష్యం.

**- ఉచిత మొబైల్ హెల్త్ క్యాంపు విజయవంతం.**

**- టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.**







**కల్వకుర్తి సూర్య న్యూస్ :** పేదల ఆరోగ్య భద్రతే నా లక్ష్యమని టాస్క్ సిఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్ట గ్రామంలో సుంకిరెడ్డి ఆరోగ్య భరోసా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత మొబైల్ హెల్త్ క్యాంపు విజయవంతమైంది. ఈ ఉచిత వైద్య శిబిరంలో 300 మంది హాజరయ్యారు, అందులో 239 మందికి రక్ష పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద ప్రజలకు వైద్యం అందించేందుకే ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజవర్గ వ్యాప్తంగా మొబైల్ హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు సుంకిరెడ్డి తెలిపారు. పేద ప్రజల కోసం ఉచితంగా అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచామని ఆయన పేర్కొన్నారు, కల్వకుర్తి నియోజవర్గ వ్యాప్తంగా ఇటీవల ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించచమని, ఎంతోమందికి చూపును అందించామని తెలిపారు, గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద కుటుంబాలు ఆర్థిక భారంతో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు, ఈ ఉచిత మొబైల్ హెల్త్ క్యాంపు తో అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చున్నారు, ఉచితంగా మొబైల్ హెల్త్ క్యాంపు నిర్వహించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, రక్త పరీక్షలు, విలువైన మందులను అందజేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాజీ సర్పంచ్ లింగమయ్య, నాయకులు బంగారయ్య, మధు, కృష్ణయ్య శెట్టి, మల్లారెడ్డి, మధు సూదన్ రెడ్డి, కేశవులు, రవి, నంద్య నాయక్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

# పెద్దకొత్తపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం.

**- రైతులు ప్రైవేట్ వ్యక్తులను నమ్మి ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దు చైర్మన్ బుడుగు శ్రీనివాసులు.**

**- హాజరైన రైతులు, అధికారులు**



**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్ :** మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ బుడుగు శ్రీనివాస్ యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన ఎల్లప్పుడూ నిలబడి వ్యవసాయోత్పత్తులకు తగిన మద్దతు ధరను అందిస్తోందని తెలిపారు.మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధరగా కొనుగోలు జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు తమ ఉత్పత్తిని సెంటర్‌కు తీసుకురావడం ముందు 14 శాతం తేమ మాత్రమే ఉండేలా చూడాలని సూచించారు. అధిక తేమ కలిగిన ధాన్యాన్ని కేంద్రం స్వీకరించదని ఆయన స్పష్టం చేశారు.ప్రతి రైతు పేరుమీద టోకెన్ తప్పనిసరిగా ఉండాలని, ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ నంబర్ వంటి అవసరమైన పత్రాలతో సెంటర్‌కు రావాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం సెంటర్‌లో తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మెరుగు రాజు, సీఈఓ సిరాజుద్దీన్, సొసైటీ డైరెక్టర్లు వెంకటమ్మ, కృష్ణశర్మ, యాదగిరి, కార్యాలయ సిబ్బంది రాములు, హాసిన, బాలు, లక్ష్మయ్య, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మొక్కజొన్న కొనుగోలు సజావుగా సాగేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని చైర్మన్ సూచించారు. రైతులు ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి, తగిన పత్రాలతో సకాలంలో ధాన్యం విక్రయించాలన్నారు.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో పాల్గొన్న దేవరకద్ర టిపిసిసి ఓబిసి వాయిస్ చైర్మన్ శ్రీనివాసులు



**దేవరకద్ర సూర్య న్యూస్ :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవీన్ యాదవ్ గెలుపు కొరకై ప్రచార కార్యక్రమంలో భాగంగా. జూబ్లీహిల్స్ సోమాజిగూడ కాంగ్రెస్ పార్టీ ప్రచార ఇంచార్జ్ టిపిసిసి శ్రీనివాసులు పాల్గొని నవీన్ యాదవ్ గెలుపు కొరకై గడపగడపకు వెళ్లి ప్రచార కార్యక్రమం కొనసాగించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకై నిరంతరం కృషి చేస్తామని మా పార్టీ నుండి నిలబడ్డ వ్యక్తిని గెలిపించుకునేందుకు నిరంతరం శ్రమిస్తామని వారు అన్నారు.

## రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలను ప్రారంభించిన విశ్రాంత పిఈటి బి.గోపాలం



**మక్తల్ సూర్య న్యూస్ :** నవంబర్ 1 నుండి 2 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ,రెడ్డి బావి గ్రామంలో గల జేబీ వెంచర్ లో ఆదివారం రాష్ట్రస్థాయి పది కిలోమీటర్ల రోడ్డు స్పీడ్ మాస్ సైకిలింగ్ పోటీలను, 14, 16 ,18 సంవత్సరాల లోపు బాల బాలికల, 23 సంవత్సరాలు లోపు మహిళల, పురుషుల సైక్లింగ్ పోటీలను నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్రాంత పిఈటి బి.గోపాలం జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి. మల్లారెడ్డి, బి. విజయ కాంతారావు, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ పాష, ఇండియా కోచ్ డాక్టర్ మాక్స్వెల్, ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ దత్తాత్రేయ, తెలంగాణ కోచ్ విజయభాస్కర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేష్, పాండు, కృష్ణ, సంజీవ్, మంచి భోజనం వసతి కల్పించిన జేబీ వెంచర్ ఇన్ఫ్రా గ్రూప్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ నీలకంఠం సురేందర్, కోటేశ్వరరావు, 28 జిల్లాల నుండి 450 మంది సైక్లింగ్ రైడర్స్ పాల్గొన్నారు.


**విలేకరులు కావలెను**

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో

పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, భూత్పూర్, కౌకుంట్ల, మిడ్జిల్, రాజాపూర్, మూసాపేట, దేవరకద్ర రూరల్

వనపర్తి జిల్లా : వనపర్తి ప్రతినిధి, వనపర్తి, వనపర్తి రూరల్, పెద్దమందడి, కొత్తకోట, పాన్‌గల్, ఖిల్లఘణపురం,

నాగర్‌కర్నూల్ జిల్లా : అమ్రాబాద్, పదర, బల్మూర్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, తాడూరు, తిమ్మాజిపేట,

జోగులాంబగద్వాల జిల్లా : ఇటిక్యాల, ఎర్రవల్లి, వడ్డేపల్లి, గట్టు, మానోపాడు

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు

8008622757